కళాశాలకు రక్షణ కరువు!

- నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణం
- రాత్రి వేళ మందుబాబులకు అడ్డా
- రూ. 8లక్షలు ఉంటే నిర్మాణం పూర్తి


అసంపూర్తిగా నిలిచిపోయిన కళాశాల ప్రహరీ


అగనంపూడి కళాశాల భవన సముదాయం

అగనంపూడి: ప్రభుత్వ కళాశాలలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కనీస వసతులు కల్పించడానికి కూడా మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతోంది. విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలకు రక్షణ కరువవుతోంది.

ఇదీ పరిస్థితి

గాజువాక మండలంలో ఏకైక ప్రభుత్వ జూనియర్ కళాశాల అగనంపూడిలో ఉంది. అప్పట్లో స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు తలో కొంత వేసుకొని కార్పస్ ఫండ్, ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానా చెల్లించడంతో కళాశాల ఏర్పాటు చేశారు. తర్వాత కళాశాలకు జాతీయ రహదారి సమీపంలో ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలం కేటాయించడంతో భవన సముదాయం నిర్మించారు.

నాడు– నేడులో వసతులు

2022లో నాడు నేడు పథకంలో రూ.40లక్షలతో ల్యాబ్, మినరల్ వాటర్‌ప్లాంట్, ఫర్నిచర్, మరుగుదొడ్ల సముదాయం నిర్మాణం, పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. తర్వాత ప్రహరీ నిర్మాణానికి అవసరమైన పునాదులు, పిల్లర్లు నిర్మించారు. నిధులు పూర్తవ్వడం, ఈలోగా ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ఆకతాయిలకు అడ్డా..

జాతీయ రహదారిని ఆనుకొని కళాశాల ఉండడంతో కళాశాల ఆవరణలోకి రాత్రి వేళల్లో మందుబాబులు ప్రవేశిస్తున్నారు. రక్షణగోడ లేకపోవడంతో పశువులు, పందులు కూడా ఆవరణలోకి వస్తాయి. దీంతో కళాశాల పరిసరాలు అస్తవ్యస్తగా మారుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కేవలం ఆరు నుంచి ఎనిమిది లక్షలు వెచ్చిస్తే ప్రహరీ నిర్మాణం పూర్తి అవుతుందని చెబుతున్నారు. ఈవిషయంలో స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలి



నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు తక్షణం పూర్తి చేయాలి. కళాశాలలో నాలుగు వందల మంది చదువుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాల్లో మంచి రికార్డులు నెలకొల్పుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించేలా కృషి చేయాలి.

ఎస్.నాయుడు, అగనంపూడి

చిన్నచూపు వద్దు



అధిక శాతం మంది విద్యార్థులు సామాన్యులు, మధ్యతరగతి వారే చదువుతున్నారు. అలాంటి కళాశాలకు కోట్లు ఖర్చు చేసి భవనాలు నిర్మించారు. వసతులు కల్పించారు. లక్షల వ్యయం చేయాల్సి వచ్చేసరికి పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదు. తక్షణం కాంపౌండ్‌వాల్ నిర్మించాలి.

కె.రమేష్, నిర్వాసితకాలనీ

ఇసుక సమస్య పరిష్కరించాలని ధర్నా



గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

గాజువాక: ఇసుక కొరత సమస్యను పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు, కలాసీలు శనివారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఇసుక లేకపోవడం వల్ల అనేకమంది పనులు కోల్పోయారన్నారు. సీఐటీయూ గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ఇసుక సరఫరా లేకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అందరికీ పని ఉంటుందని అనుకొన్నారని, ఉన్న పనులు కోల్పోయారని ఆరోపించారు. అగనంపూడి యార్డ్‌లో ఇసుక ఏమైందో ఎవరికీ తెలియడం లేదన్నారు. తక్షణమే పాలకులు స్పందించి ఇసుక సమస్యను పరిష్కరించి కార్మికులకు ఉపాధి లభించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు లోకేష్, తాతారావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

పెదగంట్యాడ: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో చైతన్య మహిళా కళాశాల 30వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట ప్రారంభించిన కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో స్టీల్‌సిటీ కళాశాల అధ్యక్షురాలు కె.శకుంతల, కరస్పాండెంట్ జేఎస్ఆర్ఎస్ వర్మ, రమణారావు, మంత్రి శంకరనారాయణ, ప్రిన్సిపాల్ ఆర్.రాధ పాల్గొన్నారు.

జీఎం దృష్టికి బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం సమస్యలు


స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ విభాగం జీఎం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు విభాగం జీఎం (ఆపరేషన్స్)పి. కృష్ణారావును కోరారు. ఈ మేరకు వారు శనివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ బార్స్ కమిటీ నిర్ణయం మేరకు ప్రతీ విభాగంలో వైద్య పరమైన అవసరాల నిమిత్తం నెలకు రెండు పర్మిషన్లు ఇవ్వాలని.. కొన్ని సెక్షన్లలో ఇవ్వకపోవడం వల్ల వైద్య అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాల వల్ల విభాగానికి వెళ్లే రహదారి గుంతలమయం అయిందని.. వీధి లైట్లు వెలగడం లేదన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. విభాగంలో లోడ్ కటింగ్‌కు వెళ్లేటప్పుడు రైల్వే ట్రాక్‌పై సరైన లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విభాగం కమిటీ అధ్యక్షుడు పోలీసు నాయుడు, కన్వీనర్ పి. అప్పలరెడ్డి, సీనియర్ ఆఫీస్ బేరర్స్ పి.వి. నగేష్, పోతారెడ్డి, సత్యారావు, మొల్లి అప్పారావు, కె.వి. రమణ, సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

177 మందికి వైద్య పరీక్షలు



శిబిరం వద్ద వైద్యులు,కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, గంగవరం పోర్టు అధికారులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో జీవీఎంసీ 64వ గొడ్డువానిపాలెంలో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. మొత్తం 177 మందిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు సీఈవో అమిత్ మాలిక్ మాట్లాడుతూ సీఎస్సార్ నిధులతో భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, పోర్టు ప్రతినిధులు రమేష్‌బాబు, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేత


దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందించిన రోటరీ క్లబ్ సభ్యులు

పెదగంట్యాడ: గాజువాక సమతా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్ (వాసు) చెప్పారు. జీవీఎంసీ 72వ వార్డు పరిధిలోని సమతానగర్‌లోని రోటర్ క్లబ్ కార్యాలయంలో శనివారం ఐదుగురు దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కిశోర్ కుమార్, విక్టర్ రాజు, లక్ష్మణరావు, ప్రభు, మన్మథరావు, కృష్ణవేణి, ధర్మారెడ్డి, ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు.

స్తంభంపై విరిగి పడిన వృక్షం


విద్యుత్ వైర్లపై పడిన వృక్షం

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం రావుల చెరువు వాకింగ్ ట్రాక్ పక్కన ఉన్న వృక్షం విద్యుత్ స్తంభంపై పడిపోయింది. శనివారం మధ్యాహ్నం చిన్నపాటి గాలి, వానకు వృక్షం వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా కూలింది. ఈ కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. ఆ సమయంలో ఎవరూ అటుగా వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ అధికారులు సమాచారం అందివ్వడంతో విద్యుత్ సరాఫరా నిలిపివేశారు.

బకాయి వేతనాలు చెల్లించాలి


స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. శనివారం నాయకులు సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఉక్కు కార్మికులకు బకాయి ఉన్న సగం జీతం వెంటనే చెల్లించాలని కోరారు. అదే విధంగా దసరా ముందు బోనస్ చెల్లించాలని, ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జి. వెంకటరమణారెడ్డి, నక్క వెంకటరమణ, మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, దరిగి రవి, కె. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పరవాడ మండల స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. శనివారం బాలుర విభాగంలో (అండర్ 14, 17) పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు పోటీలను ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో నాలుగు రోజుల పాటు క్రీడా పోటీలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బి.అన్నాజీరావు, పి.లక్ష్మి, ఎస్.వి.రమణ, నాయుడు బాబు, కర్రి అమ్మాజీ పాల్గొన్నారు.

గణపతికి లక్ష ఉండ్రాళ్లతో అభిషేకం


లక్ష ఉండ్రాళ్లతో వినాయకునికి అభిషేకం చేస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి రామాలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శనివారం గణపతికి లక్ష ఉండ్రాళ్లతో అభిషేకం జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆలయ కమిటీ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ సన్యాసిరావు, దుగ్గపు దానప్పలు, ప్రగడ శ్రీను, శంకరరావు, రామారావు, కోటేశ్వరరావు, తాతారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: నవయుగ వైతాళికుడు, సాహితీవేత్త గురజాడ అప్పారావు జయంతిని 68వ వార్డు మింది, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరుశురామ్, ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ అప్పారావు రచనలు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న నలుగురు ఉపాధ్యాయులను జనవిజ్ఞాన వేదిక తరఫున సత్కరించారు. అనంతరం ఈ నెల 25 నుంచి పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్న చెకుముఖి సైన్స్ సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, రాచకొండ శ్రీనివాసరావు, ఎం.ఎల్.ఎస్.కాంతం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ


పోషకాహార కిట్లు అందిస్తున్న నాబార్డ్ డీడీఎం దినేష్‌రెడ్డి తదితరులు

అగనంపూడి: బాలింతలు పోషకాహారం తీసుకుంటే వారి బిడ్డలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారని నాబార్డ్ డీడీఎం ఎస్.దినేష్‌రెడ్డి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని లీఫార్మా కంపెనీ ప్రతినిధులు శనివారం బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీఫార్మా డైరెక్టర్ లీలారాణి, నాబార్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శానిటరీ సిబ్బందికి సత్కారం


శానిటరీ సిబ్బందిని సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

గాజువాక: విజయవాడ వరద బాధితులకు సేవలు అందించిన 70వ వార్డు శానిటరీ సిబ్బందిని ఆ వార్డులోని డ్రైవర్స్ కాలనీ, తాబేలు కాలనీ పెద్దలు శనివారం సత్కరించారు. వార్డులో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అనంతరం కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, స్థానిక నాయకులు దీనంకొండ పావని, లంకల మురళీదేవి, బొడ్డేడ రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పందిరిరాట


రాటను ప్రతిష్ఠిస్తున్న సభ్యులు

గాజువాక: కనకదుర్గ చిల్లర వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు శనివారం పందిరి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 14వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, వర్తక సంఘం సభ్యులు సత్తిబాబు, కడవల నగేష్, సతీష్, రఘు, కిరణ్, వినోద్, చక్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కఫ్ కృషి నిరుపమానం



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

మహారాణిపేట : దేశ సమగ్రత, సంస్కృతి, మత సామరస్యానికి ఇస్కఫ్ ఎంతో కృషి చేస్తోందని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. శనివారం ప్రభుత్వ మహిళా కాలేజీ ఆవరణలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్, ఐఎస్‌సీయూఎఫ్) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సంస్థ అనేక జాతీయ, అంతర్జాతీయ శాంతి ఉద్యమాల్లో పాల్గొందన్నారు. ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇస్కఫ్ నాయకుడు టీఎస్ సుకుమారన్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వై.వెంకట లక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమ కాలేజీలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్‌కు చెందిన నరసింహులు, ఎం.ఎ. బేగం, పద్మకుమారి ,డి.మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ, కేజీహెచ్‌లో ఫార్మాకో విజిలెన్స్ వీక్


మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో శనివారం ఫార్మాకో విజిలెన్స్ వీక్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మందుల వల్ల కలిగే దుష్ప్రభావంపై ఎంబీబీఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోగులు, వారి సహాయకులకు కరపత్రాలు పంపిణీ చేసి ఫార్మాకో విజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కేజీహెచ్‌లో కూడా దీనిపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ నర్సింగ్ విద్యార్థులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ డి. శ్యామల, ఏఎంసీ ఫార్మకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె. హిమబిందు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ


స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : శనివారం ఉదయం 8 గంటలకు కనకమహాలక్ష్మి అమ్మవారికి నిర్వహించిన సహస్ర తులసిపూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజకు దంపతులను, లేదా ఇద్దరు భక్తులను అనుమతిస్తారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి పూజలో ఉభయదాతలు పాల్గొనవచ్చు.

‘ఉక్కు’కు ప్రభుత్వ సహకారం అవసరం


ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ కోరారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1318వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రూ.3450 కోట్లు జీఎస్టీ, కమర్షియల్ ట్యాక్స్ రూపంలో చెల్లించిందన్నారు. అదే పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాగిస్తే ప్రభుత్వానికి కనీసం పది వేల కోట్లు పన్నుల రూపంలో కేంద్రానికి ఉక్కు చెల్లిస్తుందనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికులు, ఉద్యోగులను తగ్గించడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.శ్రీనివాస్, డీఎస్ఆర్‌సీ మూర్తి, పట్టా రమేష్, శ్రీనివాస్, రామారావు, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని వినతి


కార్పొరేటర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న జీవీఎంసీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ నీటిసరఫరా, ఇంజినీరింగ్ సెక్షన్ల పరిధిలో పని చేస్తున్న 1500 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కౌన్సిల్ తీర్మానం ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు నాయుడు కోరారు. 79వ వార్డులో నిర్వహించిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతేడాది జులైలో జీవీఎంసీ కౌన్సిల్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.25,140లు, సెమీ స్కిల్డ్ వర్కర్లకు 29,610 చెల్లించాల్సి ఉన్నా నేటికీ రూ.13 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ధరలు నింగినంటున్నాయని, కుటుంబ సభ్యులతో కలిసి రెండు పూటల భోజనానికి సరిపోని పరిస్థితి ఉందని వాపోయారు. జీవీఎంసీ మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు సానుకూలంగా స్పందించి కౌన్సిల్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని వారు కోరారు. తర్వాత కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, బట్టు సూర్యకుమారిలకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింగరావు, సన్యాసిరావు, కొండలరావు, బొరయ్యనాయుడు, అంజిబాబు, రామకృష్ణ, సుబ్బరాజు, అచ్చిబాబు, గోవింద్, సుభాని, హమీద్, రజాక్, కరీమ్, పెంటారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతిపై పెయింటింగ్ పోటీలు


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అతిథులు

గాజువాక: ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ పీస్ పోస్టర్ కాంటెస్ట్ 2024కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. పరిమితులు లేని శాంతి అంశంపై గాజువాక, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాల కోటేశ్వరరావు, ప్రతినిధులు పాలిశెట్టి లక్ష్మణ్, బలివాడ సత్యారావు, ఎం.ఎస్.ఎన్.మూర్తి, నున్న శ్రీనివాసరావు, ఎం.ఎల్.కె.ఎన్.అచ్యుతరావు, కోసూరు జగదీష్, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.